# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 164 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 13 మే 2026 | పేజీలు : 4




కలెక్టర్ తన తీరు

## మార్చుకోవాలి

- జనగామ అఖిలపక్ష నేతల డిమాండ్

3

అవినీతి రహితంగా పేదలకు

## ప్రభుత్వ ఫలాలు

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడి

3



ధాన్యం కొనుగోళ్లలో

# నిర్లక్ష్యం వద్దు

- అన్ని ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోండి
- కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలించాలి
- అన్ని వాహనాలను రవాణాకు వినియోగించండి
- కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం, మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి, సమీక్షించారు. - మన చౌరాస్తా, జనగామ









# కొనుగోళ్లలో నిర్లక్ష్యం వద్దు

- **అన్ని ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోండి**
- **కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలించాలి**
- **అన్ని వాహనాలను రవాణాకు వినియోగించండి**
- **రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**




**జనగామ, మన చౌరాస్తా :** ధాన్యం, మొక్కజొన్న పంట కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం, మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి, సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అవసరమైన అన్ని చట్టాలను వినియోగించి నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీలు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు కొనుగోలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా కూడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, అవసరమైన పోలీసుల సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ధాన్యం రైస్ మిల్లులకు చేరిన తర్వాత రైతులకు రశీదులు ఇస్తుండటం వల్ల కోతలు జరుగుతున్నాయని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదని సీఎం స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.


ప్రతి రైస్ మిల్లుకు కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం సమర్థవంతమైన అధికారిని నియమించాలని, ఆయా అధికారులు ప్రతి రోజూ నివేదికలు పంపించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు మిషన్ మోడ్‌లో పని చేయాలని సీఎం ఆదేశించారు.

ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. కొనుగోళ్ల అంశాన్ని తేలికగా తీసుకునే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ వివిధ సమస్యలపై రైతులు రోడ్డెక్కుతున్న పరిస్థితి రావొద్దని, రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు ఇవ్వని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు.

ఈ వీసీ తదనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు రాకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు.

ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక అధికారిని నియమించాలని, ధాన్యం కొనుగోళ్లు పూర్తి అయ్యేవరకు కేంద్ర నిర్వాహకులు, కేంద్ర ఇంచార్జిలు అప్రమత్తంగా ఉండి, సరిపడా గన్ని బ్యాగ్ లను, టార్ఫాలిన్ లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

టోకెన్ పద్ధతి ప్రకారం తేమ శాతం రాగానే కొనుగోళ్లు చేపట్టి, అదే రోజూ వేంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యాన్ని తరలించాలన్నారు. ప్రతి కేంద్రానికి ఒక లారీని కేటాయించామని, కేంద్ర నిర్వాహకులు ఆ లారీతో పాటు వారికి సంబంధించిన ఒక వ్యక్తిని కూడా మిల్లుకు పంపించి, త్వరగా ధాన్యం అన్‌లోడింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈవో, ఇంచార్జి డీఆర్డీఓ రంగారావు, పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, సహకార శాఖ అధికారి కోదండరాములు, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, ఇంచార్జి డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, ఏపీడీ నూరుద్దీన్, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సమాజ నిర్మాణంలో
# యువతే కీలకం

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. సామాజిక సేవ ద్వారానే నిజమైన ఆనందం, సంతృప్తి లభిస్తాయి. యువ శక్తిని సామాజిక ప్రయోజనాల కోసం మళ్లించినప్పుడే 'నవసమాజ నిర్మాణం' సాధ్యమవుతుంది.

### సేవ, వ్యక్తిత్వ వికాసం

సామాజిక సేవ అనేది కేవలం ఇతరులకు సహాయం చేయడం మాత్రమే కాదు, అది ఒక వ్యక్తిని సంపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దుతుంది. సమాజ సమస్యలను ప్రత్యక్షంగా చూడటం వల్ల యువతలో బాధ్యతాయుతమైన పౌరసత్వం, ఇతరుల పట్ల సానుభూతి పెరుగుతాయి.

**ఆత్మవిశ్వాసం :** ఇతరులకు సహాయం చేయడం ద్వారా కలిగే తృప్తి, తమ సామర్థ్యాలపై తమకు నమ్మకాన్ని (Selfworth) కలిగిస్తుంది. సేవలో పాల్గొనడం వల్ల ఒత్తిడి తగ్గి, సానుకూల దృక్పథం అలవడుతుంది.

### నైపుణ్యాల అభివృద్ధి..

సేవా కార్యక్రమాలు యువతకు ఒక ప్రాక్టికల్ పాఠశాల వంటివి. నాయకత్వ లక్షణాలతో ఒక బృందాన్ని నడిపించడం, నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి నైపుణ్యాలు మెరుగుపడతాయి.

**టీం వర్క్ :** విభిన్న ఆలోచనలు కలిగిన వ్యక్తులతో కలిసి పనిచేయడం వల్ల సహకార స్ఫూర్తి, సమన్వయం పెరుగుతాయి. నిజ జీవిత సవాళ్లను ఎదుర్కోవడం ద్వారా విశ్లేషణాత్మక ఆలోచన, ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనే సామర్థ్యం లభిస్తుంది.


### సామాజిక మార్పులో క్రియాశీల పాత్ర

యువత తమ శక్తిని ఈ క్రింది రంగాల్లో వినియోగిస్తే సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుంది. నిరక్షరాస్యులకు విద్యాబోధన చేయడం, నేటి కాలానికి అవసరమైన డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, కాలుష్య నియంత్రణ, పర్యావరణ అనుకూల జీవనశైలిపై అవగాహన కల్పించడం. ఆరోగ్య అవగాహన కల్పించడం. వ్యాధుల నివారణ, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లపై ప్రజలను చైతన్యపరచడం. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణ సహాయక చర్యల్లో పాల్గొని బాధితులకు అండగా నిలవడం.

### సుస్థిర అభివృద్ధి దేశాభివృద్ధి

యువత సామాజిక సేవలో నిమగ్నమవ్వడం వల్ల చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారు. బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పడటం ద్వారా సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తగ్గుతాయి. నేటి యువత చేసే సేవ భవిష్యత్ తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తుంది.

**గెస్ట్ కాలమ్**




- ఏనుగుల వేలంగిని,

**ఎమ్ ఫార్మసీ (మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్)**

# అవినీతి రహితంగా పేదలకు ప్రభుత్వ ఫలాలు

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి తావు ఉండకూడదని, అధికారులు, ప్రజా ప్రతినిధులు పారదర్శకంగా పని చేయాలని స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి సూచించారు. లింగాలఘణపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 51 మంది లబ్ధిదారులకు రూ. 51,05,916 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, అలాగే 18 మందికి రూ. 6,84,000 విలువైన ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న రెండు నెలల్లోనే లబ్ధిదారులకు చెక్కులు అందేలా బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఈ చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపిణీ చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామాలలోని సర్పంచులు చొరవ చూపి, వివాహం జరిగిన నెల రోజుల్లోపే దరఖాస్తులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. గత పాలకులు పథకాలను, పదవులను అమ్ముకుని నియోజకవర్గ ప్రతిష్టను దెబ్బతీశారని, ఇకపై అలాంటి పరిస్థితులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని, అభివృద్ధి విషయంలో అందరూ ఐకమత్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. లింగాల ఘనపూర్ మండల కేంద్రంలో తెలంగాణ నమూనా పాఠశాల ఏర్పాటుతో పాటు, అసంపూర్తిగా ఉన్న బాలికల వసతి గృహం నిర్మాణానికి రూ. 1.40 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే ఆ పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి గోపీరామ్, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మార్కెట్ వైస్ చైర్మన్ శివ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఘనంగా హనుమాన్ శోభయాత్ర

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్ ఘన్‌పూర్‌లో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హనుమాన్ శోభయాత్రలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) పాల్గొన్నారు. స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఈ శోభయాత్రలో పాలుపంచుకున్నారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు, భక్తులకు ఆయన హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీజేపీ ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.




# బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ సెంటర్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ మాట్లాడుతూ.. భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనప్పటికీ, అధికార బలంతో బండి సంజయ్ తన కుమారుడి తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి చట్టాన్ని గౌరవించాల్సిన వ్యక్తి, తన కుమారుడిని సమర్థించడం సిగ్గుచేటని, నైతిక బాధ్యత వహించి బండి సంజయ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం నిందితుడికి కొమ్ముకాస్తూ, బాధితురాలికి అన్యాయం చేస్తున్నాయని వారు మండిపడ్డారు. గతంలోనూ భగీరథ్ ర్యాగింగ్, డ్రగ్స్ వంటి వివాదాల్లో ఉన్నా తండ్రి అండతో తప్పించుకున్నారని, ఇప్పుడు బాధితురాలి కుటుంబానికి బండి సంజయ్ అనుచరుల నుండి బెదిరింపులు వస్తున్నాయని ఆరోపించారు. బాధితురాలి కుటుంబానికి తక్షణమే రక్షణ కల్పించి, సమగ్ర విచారణ జరిపించాలని, లేనిపక్షంలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్య, జిల్లా కమిటీ సభ్యులు నల్ల సాత్విక్ రెడ్డి, ఆమనగంటి అరవింద్, కళ్యాణ్, వేణు, మనిత్ పాల్గొన్నారు.

# కలెక్టర్ తన వైఖరి మార్చుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కలెక్టర్ అనుసరిస్తున్న నియంతృత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం స్థానిక విజయ ఫంక్షన్ హాల్‌లో జిల్లా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడిగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ వ్యవహారశైలి వల్ల జిల్లాలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించి, ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో బాధితులు తమ ఆవేదనను వెలిబుచ్చుతూ.. గత కలెక్టర్ మంజూరు చేసిన దళిత మహిళ టీ స్టాల్‌ను ప్రస్తుత కలెక్టర్ కనికరం లేకుండా తొలగించారని, విజయ డైరీ పార్లర్‌ను కూడా తీసివేయించి పేదల జీవనోపాధిని దెబ్బతీశారని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల అమలును అడ్డుకోవడమే కాకుండా, వ్యక్తిగత కక్షతో వ్యాపారులపై వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా విచారణలు చేయిస్తూ వేధిస్తున్నారని మాజీ కౌన్సిలర్ కత్తుల రాజి రెడ్డి ఆరోపించారు. ఇసుక, మట్టి సరఫరాపై అడ్డగోలు నిబంధనలు పెట్టి, ట్రాక్టర్ యజమానులు, భవన నిర్మాణ కార్మికులను ఉపాధి లేకుండా చేస్తున్నారని నాయకులు ధ్వజమెత్తారు. న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, విలేకరులను సైతం కలెక్టర్ గౌరవించడం లేదని సమావేశం మండిపడింది. కలెక్టరేట్‌కు వచ్చే న్యాయవాదుల వాహనాలను కిలోమీటరు దూరంలోనే ఆపడం, మహిళా కౌన్సిలర్లను కలవడానికి నిరాకరించడం వంటి చర్యలు కలెక్టర్ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. పత్రికా విలేకరులను సైతం అవమానాలకు గురిచేస్తున్నారని పార్నంది వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వ్యవహారంపై ప్రజలందరూ ఏకమై ఆందోళనలు చేపట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. చివరగా జిల్లా కలెక్టర్ తన వైఖరిని 20 రోజులలోపు మార్చుకోకపోతే రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, సంఘాలు కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశములో సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు మల్లిగారి రాజు, సి.పి.యం. సీనియర్ నాయకులు యం.డి. దస్తగిర్, అవాజ్ జిల్లా కార్యదర్శి యం.డి. అజహర్, రజక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొలిపాక నర్సింహులు, చేతి వృత్తి దారుల సమన్వయ కమిటి జిల్లా కన్వీనర్ బూడిద గోపి, సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పజ్జూరి జయహరి, ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు కాసాని ఉపేందర్, జాల రమేష్, తిప్పారపు ఉపేందర్, జితేందర్, ఉల్లెంగుల మణికుమార్, ఎండబట్ల భాస్కర్, ఆశిష్, పల్లేరుల లలిత, పొత్కనూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, అలాగే రోడ్డు భద్రత ప్రమాణాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రహదారి భద్రతపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు గల రెండు నేషనల్ హైవేలపై రెండు లేన్ ల రోడ్డు పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగకుండా నేషనల్ హైవే రోడ్ ల వద్ద ప్రయాణికుల భద్రత కోసం తగు ప్రమాణాలను పక్కాగా పాటించాలన్నారు. ప్రధాన రహదారి వద్ద వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను చేసుకోకుండా వారి కోసం ప్రత్యేక వెండింగ్ జోన్ ను ఏర్పాటు చేయాలన్నారు. రహదారులకు ఇరువైపులా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా లైటింగ్ తప్పకుండా ఉండాలన్నారు. సమావేశంలో ఇంచార్జి ఆర్&బీ ఈఈ సరిత, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, ఎక్సైజ్ అధికారి అనిత, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, ఆర్టీఏ మెంబర్ అభి గౌడ్, జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, నేషనల్ హైవేస్ అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలు పోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సీఐ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం.. జిల్లాలోని బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన పసుల అఖిల్ కుటుంబం కొన్నేళ్లుగా జనగామలో ఉంటున్నారు. జనగామ మండలం పెద్దపహాడ్ శివారు ఓ తండాకు చెందిన ఓ వివాహితతో అఖిల్ సహజీవనం చేస్తున్నాడు. కూతురు, కుమారుడు ఉన్న ఆమెకు ఎనిమిదేళ్ల కింద పెళ్లికాగా.. ఐదేళ్ల కింద భర్త చనిపోయాడు. ఒంటరి జీవనం సాగిస్తున్న అమెకు అఖిల్ పరిచయమయ్యాడు. కొద్ది రోజులుగా ఆ మహిళ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ సమీపంలో కూల్ డ్రింక్ షాపు నడిపిస్తోంది. ఈ క్రమంలో అఖిల్ ఆమెపై అనుమానం పెంచుకుని గొడవకు దిగాడు. ఈ విషయంపై బాధిత మహిళ ఇప్పటి వరకు రెండుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అఖిల్, అతని తల్లికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ఊరుకోని అఖిల్ మంగళవారం రాత్రి బాటిల్లో పెట్రోలు తీసుకుని కూల్ డ్రింక్ షాప్కు వెళ్లాడు. మహిళతో వాగ్వాదం జరగగా ఆగ్రహంతో తన శరీరంపై పెట్రోలు పోసుకుని అక్కడే నిప్పంటించుకు న్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని తీవ్ర గాయాలతో పడిపోయిన అఖిల్‌ను జిల్లా ఆస్పత్రికి పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఎంజీఎంకు తరలించారు.




## శ్రీనివాస మంగాపురం సెకండ్ సింగిల్ ప్రోమో

మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్థమవుతోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సాంగ్ కి కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించాడు. ఇక రేవంత్ తన వాయిస్ తో ఈ సాంగ్ ని నెక్ట్స్ లెవెల్ కి తీసుకెళ్లాడు. జయకృష్ణ క్యూట్ స్టెప్స్, మాస్ లుక్, రషా అందం, విజువల్స్ అదిరిపోయాయి. మే 13 న ఫుల్ సాంగ్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**